

ఉప కమిషనర్ సుజాతకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ నర్సింహగుప్తా

కాలనీ స్థలాన్ని కబ్జాచెర నుంచి రక్షించాలి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాలనీ స్థలాన్ని కబ్జాదారుల చెర నుంచి విడిపించి, కాలనీ అవసరాలకు ఉపయోగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ భవానీనగర్‌కాలనీ వాసులతో కలిసి చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా గురువారం సరూర్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. భవానీనగర్ కాలనీకి చెందిన 350 గజాల ఖాళీ స్థలాన్ని ఓ వ్యక్తి కబ్జా చేయడంలో భాగంగా, జీహెచ్ఎంసీ అనుమతుల కోసం చేసుకున్నాడని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సదరు స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి ఉపకమిషనర్‌ను కలిసి, నిర్మాణ అనుమతుల కోసం అక్రమంగా చేసుకున్న దరఖాస్తును రద్దు చేయాలని విన్నవించారు. అదేవిధంగా ఆ స్థలాన్ని కాలనీ అవసరాల కోసం అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్, లక్ష్మీనారాయణ, చిన్నా, రవీందర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌యాదవ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

అనుమతులు లేని హాస్టళ్లపై చర్యలు చేపట్టండి

దిల్‌సుఖ్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కాలనీలలో కొనసాగుతున్న ప్రైవేటు హాస్టళ్లపై చర్యలు చేపట్టాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేటు హాస్టళ్ల మూలంగా కాలనీలలో తలెత్తుతున్న సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వ విభాగాలు, పోలీసుశాఖ, ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ గురువారం ఉపకమిషనర్ సుజాత, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. డివిజన్ పరిధిలో అనుమతులున్నటువంటి, అనుమతులు లేనటువంటి హాస్టళ్ల వివరాలను తెలియజేయాలని కౌన్సిల్‌లో ప్రశ్నించినప్పటికీ, ఇంతవరకు వివరాలు అందజేయకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. వెంటనే వివరాలను వెల్లడించాలని ఆయన కోరారు.



నందనవనంలో బోనాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

బోనాల ఏర్పాట్లను పరిశీలించిన కార్పొరేటర్

చంపాపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం, దేవినగర్‌కాలనీలో గురువారం కార్పొరేటర్ సుజాతానాయక్ పర్యటించి ఆలయాలలో జరుగుతున్న బోనాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బోనాల వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం బోనాల పండుగ చెక్కులను కార్పొరేటర్ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ హేమునాయక్, నాయకులు, కాలనీల ప్రతినిధులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, గోపీమధు, అనిత, నర్సింహ, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

అమ్మవారి ఆలయాల వద్ద అభివృద్ధి పనులు

చాదర్‌ఘాట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల వద్ద పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. గురువారం మూసారాంబాగ్ డివిజన్‌లోని అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు, ఇతర పనులను ఆమె పరిశీలించారు. బోనాల పండగ దగ్గర పడుతున్న నేపథ్యంలో అమ్మవారి ఆలయాల వద్ద సౌకర్యాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, నాయకులు సంతోష్, బాలరాజు, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కోలుకోవాలని కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌రెడ్డి

ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని ఆలయంలో పూజలు

చంపాపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని కోరుతూ గురువారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని రోజులుగా ఎమ్మెల్యే జ్వరంతో అస్వస్థతకు గురై ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు, ఆయన త్వరగా కోలుకోవాలని స్వామి వారిని వారు వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మేక సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, నాయకులు వింజమూరి రాఘవాచారి, బొంబాయి, జగదీష్‌గౌడ్, చందూయాదవ్, సత్తిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి: కార్పొరేటర్



బీఎన్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేసి, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్‌ను కోరారు. గురువారం డివిజన్‌లోని పలు కాలనీల్లో జోనల్ కమిషనర్ కార్పొరేటర్‌తో కలిసి పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా డివిజన్‌లోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో డీసీ తిప్పర్తి యాదయ్య, సువర్చల, ఈఈ రమేష్‌బాబు, పలు విభాగాల అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

తెలంగాణలో రైతు రుణమాఫీ చరిత్రాత్మక ఘట్టం

- టీపీసీసీ ప్రధానకార్యదర్శి చిగిరింత, డీసీసీ అధ్యక్షుడు చల్లా

సరూర్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రైతు రుణమాఫీ పథకం చరిత్రాత్మకమని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలల్లోనే చేసి చూపించిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ పథకం ప్రారంభించిన సందర్భంగా టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ బస్టాండ్ కూడలిలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఇందులో భాగంగా రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం చిగిరింత, చల్లా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం పదవి చేపట్టగానే దేవుడి సాక్షిగా రుణమాఫీ ప్రకటన చేశారని, ఇప్పుడు రైతుల సాక్షిగా దానిని అమలు చేశారని అన్నారు. తొలి విడతలో రూ.లక్ష రుణమాఫీ చేశారని, పంద్రాగస్టులోగా మొత్తం రూ.2లక్షల రుణమాఫీ అమలు జరిగి తీరుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సంతోషిశ్రీనివాస్‌రెడ్డి, బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, వైస్ ఛైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బీ.జంగయ్య, కె.శ్రీరాంరెడ్డి, పీ.వెంకటేశ్‌గౌడ్, మర్రి తిరుపతిరెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, వల్లపు సుభాన్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, అమృతనాయుడు, శ్రీనివాస్‌గౌడ్, అశోక్, ఐలమ్మ, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీధర్, విజయ్‌కుమార్, నరహరిగౌడ్, మురళి, రియాసత్, ప్రవీణ్ పాల్గొన్నారు.



మందమల్లమ్మ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు తదితరులు



నాదర్‌గుల్‌లో సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న చిగిరింత, చల్లా తదితరులు

జిల్లెలగూడలో..

జిల్లెలగూడలోని మంద మల్లమ్మచౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చల్లా నర్సింహారెడ్డి పాల్గొని సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేటర్లు మౌనికాశ్రీశైలం, భైగల్ల బాలమణి, నాయకులు వెంకటేశ్‌గౌడ్, సిద్దాల దశరథ్, యాదిరెడ్డి, కృష్ణ, లింగారెడ్డి, గంగమ్మ, పద్మ పాల్గొన్నారు.

రైతుల రుణమాఫీ సీఎం సాహసోపేతమైన నిర్ణయం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

చాదర్‌ఘాట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని రైతుల రుణమాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ కొనియాడారు. గురువారం మలక్‌పేట మార్కెట్‌లో కాంగ్రెస్ డివిజన్ల అధ్యక్షులు షకీల్, చక్రపాణి, రాహుల్‌సింగ్, షాహిద్‌ఖాన్, సంతోష్‌యాదవ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, విష్ణుతోపాటు పార్టీ కార్యకర్తలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చెకొలేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 2022లో ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుల రుణమాఫీకి సీఎం శ్రీకారం చుట్టి రైతుల పక్షపాతిగా మారారని అన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంతోపాటు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడానికే సీఎం రుణమాఫీ చేసేందుకు నిర్ణయం హర్షదాయకమన్నారు.



మలక్‌పేట మార్కెట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ తదితరులు

మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు అప్పగించొద్దు

- సీఐటీయూ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ర్యాలీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించవద్దని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో విజయవాడ జాతీయ రహదారిపై మధ్యాహ్న భోజన కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న కార్మికులకు కాకుండా పథకాన్ని కొత్తగా అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించక పోగా కొత్తగా పథకాన్ని అక్షయ పాత్ర స్వచ్ఛంద సంస్థ పథకానికి అప్పగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. 23 ఏళ్లుగా విద్యార్థులకు భోజనం వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు కాకుండా పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించి అక్షయ పాత్రకు అప్పగించే ప్రయత్నాన్ని వెనక్కుతీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, సత్యనారాయణ, శివకుమార్, స్వరూప, యాదమ్మ, గీత, లలిత, రుక్కు, భాయ్, లక్ష్మమ్మ, నవనీత, జ్యోతి, అనిత, వెంకటమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్‌లో విజయవాడ జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులతో సీపీ సుధీర్‌బాబు

మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన పెంచాలి : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన పెంచడంపై ప్రధానంగా దృష్టిని సారించాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. కొత్తగా ఎన్నికైన రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫీస్ బేరర్లతో నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడాది పాటు చేపట్టాల్సిన కార్యక్రమాల ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన బృందాన్ని అభినందించడంతోపాటు సమాజానికి సేవ చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు అనేక కొత్త కార్యక్రమాలను ప్రారంభించేందుకు, సంబంధిత ఫోరమ్ కన్వీనర్లతో చర్చించి, ప్రతిపాదనలను ముందుకు తేవాలని, యువతను ఆహ్వానించి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ప్రధాన కార్యదర్శి సతీష్ వడ్లమాని, నూతనంగా ఎన్నికైన ఆఫీస్ బేరర్లు రఘువీర్, ప్రధాన కార్యదర్శి, ఫోరం నాయకులు యల్లపు వాసుదేవ్ రావు, రాధికానాథ్, శివప్రసాద్ కరడి, కె శ్రీనివాస్, వంశీ ముత్యపు ఫోరమ్ కోఆర్డినేటర్లు రాజేష్, వసుధారాణి, చంద్రశేఖర్, జగన్‌యాదవ్, ఆర్‌కేసీ చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి పాల్గొన్నారు.

గురుపూర్ణిమను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

- ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించిన దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్ ట్రస్ట్ పాలకవర్గ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షిరిడీ సాయి సంస్థాన్‌లో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు గురుపూర్ణిమ ఉత్సవాలు కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థాన్ ట్రస్ట్ ఛైర్మన్ బీవీ శ్యాంకుమార్, ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, మాజీ ఛైర్మన్లు గుండా మల్లయ్య, బచ్చు గంగాధర్, వనం యాదయ్య, ఉపాధ్యక్షులు పద్మాకర్ ఆత్రే, శంకర్‌రావు, జాయింట్ సెక్రటరీలు కిరణ్‌కుమార్, రాజశేఖర్ వెల్లడించారు. గురువారం సంస్థాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించి, మహోత్సవ పూజా కార్యక్రమాలను వెల్లడించారు.

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు..

ఉత్సవాల మొదటి రోజు 20వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు భక్తులచే సాయి లక్ష పుష్పార్చన, 10గంటలకు గురుపాదుకా పూజా కార్యక్రమం, మధ్యాహ్నం 12గంటలకు అఖండ హారతి, రాత్రి 7.30గంటలకు ప్రత్యేక భజన, 21వ తేదీ ఆదివారం గురుపూర్ణిమ రోజు ఉదయం 6గంటలకు 108 వెండి కలశములచే పవిత్రనదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అష్టోత్తర కలశాభిషేకం, మంగళస్నానం, ఆదివారం ఉదయం 9గంటల నుంచి సోమవారం ఉదయం 9గంటల వరకు 24గంటల పాటు సాయినామ అఖండ ఏకాహం ఉంటుంది. రాత్రి 7.30 గంటలకు 108 కలశాలతో సాయి కలశ దీపములతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 22వ తేదీ సోమవారం ఉదయం 6.50 గంటలకు 108 బంగారు పుష్పాలతో సువర్ణ పుష్ప అలంకరణ, 7.15గంటలకు జీవిత కాల సభ్యులకు, నిత్యాన్నదాన పథకం సభ్యులకు అర్చన, వేద ఆశీర్వచనం, రాత్రి 7గంటలకు బాబా వారి రథోత్సవం, విశేష పల్లకీ ఊరేగింపు కార్యక్రమాలుంటాయి.



బాబా సన్నిధిలో గురుపూర్ణిమ ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

గురుపూర్ణిమ రోజు అర్ధరాత్రి వరకు దర్శనం

గురుపూర్ణిమ రోజు ఉదయం 6గంటల నుంచి శనివారం తెల్లవారుజామున వరకు దర్శనానికి అనుమతివ్వనున్నారు. అదేవిధంగా ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు సంస్థాన్ వెనుక వైపు వీధిలో, మెగా థియేటర్ వెనుక గేటు వద్ద నిరంతరాయంగా అన్నదానం నిర్వహించనున్నారు. రాత్రి మొత్తం దర్శన సౌలభ్యం ఉన్న నేపథ్యంలో భక్తులు గుంపులు, గుంపులుగా కాకుండా వేర్వేరు సమయాల్లో దర్శనానికి రావాలని పాలకవర్గ సభ్యులు విన్నవించారు.



బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని టీచర్స్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి తన వంతుగా అయ్యప్ప సేవా సమితికి రామసుబ్రహ్మణ్యం రూ.25లక్షల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, రేణుకా రాజేశ్వరి పీఠం జగన్మాత సేవలో నవీన్‌శర్మ, కాలనీవాసుల పాల్గొన్నారు. - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి



తెలంగాణ ఎన్నికల పనులు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి అవసరమైన సిబ్బందిని(ఆపరేటర్లు, అటెండర్లు) గ్లోబల్ కాంట్రాక్టర్స్‌ను సరఫరా చేసింది. ఎన్నికల పనులు నిర్వహించినప్పటికీ సిబ్బందికి డబ్బులు చెల్లించకపోవడంతో ఆర్కేపురంలోని గ్లోబల్ కాంట్రాక్టర్స్ కార్యాలయానికి సదరు సిబ్బంది వచ్చారు. స్పందన లేకపోవడంతో ఆవేదనతో సిబ్బంది వెనుదిరిగారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి



ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న యూత్‌ఫర్ సేవా ప్రతినిధులు

ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ల వితరణ


అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాలకు యూత్‌ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ వారు సుమారు రూ.3లక్షల విలువ చేసే కంప్యూటర్లను వితరణగా గురువారం హెచ్ఎం దశరథరెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా యూత్ ఫర్ సేవా వలంటీర్ అరవింద్ మాట్లాడుతూ క్లాస్ రూంల్లో సైన్స్ డ్రాయింగ్ వేయించడంతో పాటు విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను, తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణలత, భువనేశ్వరి, జయప్రకాష్, వెంకటయ్య, శ్రీనివాస్, రాములయ్య, దినేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ ఐవోఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్, జిల్లా అధ్యక్షుడు చైతన్యయాదవ్

చాదర్‌ఘాట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సదుపాయాలు లేని కారణంగా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, జిల్లా అధ్యక్షుడు చైతన్యయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సైదాబాద్ మండలం డిప్యూటీ ఐవోఎస్ వరప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సైదాబాద్ మండలంలోని కొన్ని పాఠశాలలు పురాతన భవనాల్లో ఉండడంతో ఇటీవల మరో ప్రాంతానికి మార్చారని దీని కారణంగా ఆయా ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులు దూరమైన పాఠశాలలకు వెళ్లలేక చదువుకు దూరమయ్యే ప్రమాదముందన్నారు. తక్షణమే పురాతన భవనాలను కూల్చివేసి కొత్త భవనాలను నిర్మించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ద్వాదశి సందర్భంగా ప్రజలు సుఖఃసంతోషాలతో జీవించాలని కోరుతూ నాగోల్‌లోని తన నివాసంలో అన్నదాన కార్యక్రమం చేపడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ కోఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఉప్పల స్వప్న, సాయితేజ, సాయికిరణ్ తదితరులు - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

హైదరాబాద్- వాడి మార్గంలో ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్- వాడి మార్గంలో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07175) ఈనెల 20న ఉదయం 10.05గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, మధ్యాహ్నం 3.30గంటలకు వాడి చేరుతుంది. వాడి- హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07176) ఈనెల 20న సాయంత్రం 4.20గంటలకు వాడి నుంచి బయల్దేరి, రాత్రి 9.20గంటలకు హైదరాబాద్ చేరుతుంది. హైదరాబాద్- వాడి స్పెషల్ (రైల్ నం: 07177) ఈనెల 22న ఉదయం 5.00గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి, 10.15గంటలకు వాడి చేరుతుంది. వాడి- హైదరాబాద్ స్పెషల్ (రైల్ నం: 07178) ఈనెల 22న ఉదయం 11.05గంటలకు వాడి నుంచి బయల్దేరి సాయంత్రం 4.00గంటలకు హైదరాబాద్ చేరుతుంది.

రెండు రైళ్ల పాక్షిక రద్దు

ఈనెల 21న జైపూర్ నుంచి బయల్దేరే జైపూర్- హైదరాబాద్ (నం: 07116) రైలును జైపూర్- అజ్మీర్ మధ్య రద్దు చేశారు. ఈనెల 19న హైదరాబాద్ నుంచి బయల్దేరే హైదరాబాద్- జైపూర్ (నం: 07115) రైలును అజ్మీర్- జైపూర్ మధ్య రద్దు చేశారు.

ప్రేమ పేరుతో బాలికపై అత్యాచారం

- పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబసభ్యులు
- బడంగ్‌పేట్‌లో ఘటన

సరూర్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను లోబరచుకున్న ఓ యువకుడు ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన సంఘటన మీర్‌పేట్ పోలీసుస్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బడంగ్‌పేట్‌లో నివసిస్తోంది. కాగా, బడంగ్‌పేట్‌కు చెందిన యువకుడు అదే ప్రాంతంలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. యువకుడి కుటుంబం, బాలిక కుటుంబం బడంగ్‌పేట్‌లోని ఒకే అపార్ట్‌మెంట్‌లోని వేర్వేరు ఫ్లాట్లలో అద్దెకుంటున్నాయి. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడగా, దానిని అవకాశంగా తీసుకున్న యువకుడు (24) బాలికను(15) ప్రేమ పేరుతో లోబరచుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల బాలిక అస్వస్థతకు గురవగా ఆస్పత్రికి తీసుకెళ్లడంతో గర్భవతి అని తేలింది. దాంతో బాలిక తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన విషయం చెప్పింది. గురువారం బాలిక కుటుంబసభ్యులు మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు.

హయత్‌నగర్‌లో మూడు కాలనీలలో వరుస చోరీలు

- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్..?
- 9తులాల బంగారు ఆభరణాలు అపహరణ

హయత్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడు కాలనీలలో తాళం వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకుని అందిన కాడికి దోచుకుపోయారు. వివరాలు ప్రకారం.. మునగనూర్ నుంచి తొర్రూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న శ్రీనగర్‌కాలనీ టౌన్‌షిప్‌లో నివాసం ఉండే శ్రీనివాసరావు ఈనెల 16వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో దైవదర్శనం కోసం షిరిడీకి వెళ్లాడు. 18వ తేదీ గురువారం సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళం తీసి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 5తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. గుర్తు తెలియని దుండగులు దోచుకుపోయారని గ్రహించిన శ్రీనివాసరావు హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హయత్‌నగర్‌లోని బృందావన్‌కాలనీలో నివాసం ఉండే నరేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బుధవారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌కు వెళ్లారు. గురువారం సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రూ. 20వేల నగదు కనిపించలేదు. దీంతో ఆయన హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రీన్‌హోమ్స్ కాలనీలో నివాసం ఉండె కె. ఆదిత్య సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కొండాపూర్‌కు వెళ్లారు. రెండు రోజుల తర్వాత గురువారం సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 4తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడి దోచుకుపోయారని గ్రహించిన ఆదిత్య హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు క్లూస్ టీంను రప్పించి వేలి ముద్రలను సేకరించారు. సీఐ రామకృష్ణ దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను పంపిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.